క్లుప్తంగా

మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కందుకూరు: కందుకూరు మండల ఫొటోగ్రాఫర్లు మరియు వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. అసోసియేషన్ భవనానికి 500 గజాల స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు చందు, ప్రధానకార్యదర్శి హరిప్రసాద్, ఎం.నరసింహా, రాకేశ్‌రెడ్డి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కేంద్రంలోని పోచమ్మ అమ్మవారి 7వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్పొరేటర్లు స్వప్న, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు సంజీవరెడ్డి, మల్లారెడ్డి, బాబుల్‌రెడ్డి, రాళ్లగూడం బల్వంత్‌రెడ్డి పూజలో పాల్గొన్నారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ అర్జున్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



వేడుకలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

మీర్‌పేట: పాఠశాల దశ నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని నారాయణ విద్యాసంస్థల జీఎం.గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మీర్‌పేట నారాయణ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో నిర్వహించిన కేబినెట్ ఇన్‌స్టాలేషన్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటు అన్ని అంశాలలో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. అనంతరం స్కూల్ హెడ్‌బాయ్‌గా ఉత్సవ్‌గోయల్, హెడ్‌గర్ల్‌గా యోచనారెడ్డి, డిప్యూటీ హెడ్‌గర్ల్‌గా శ్రద్ధ, డిప్యూటీ హెడ్ బాయ్‌గా సాయిపునీత్‌లను ఎంపిక చేసి వారికి బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ బాబ్జీ, వైస్ ప్రిన్సిపాల్ ధరణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం బంద్



మూతపడ్డ ఎంఈఓ కార్యాలయం

కందుకూరు: తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు తరలివెళ్లడంతో ఎంఈఓ కార్యాలయం మూతపడింది. సీఆర్పీలు, ఎంఎస్ కో ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీలు, కస్తూర్బాగాంధీ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ధర్నాకు తరలివెళ్లారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ అందరినీ క్రమబద్ధీకరించాలని, ఆరోగ్య భద్రత కార్డులు తదితర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ధర్నాకు ళ్లారు. దీంతో ఎంఈఓ కార్యాలయంలో పూర్తిగా కాంట్రాక్టు ఉద్యోగులే ఉండటంతో కార్యాలయం తెరుచుకోలేదు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంజూరైన గొర్రెలను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుక్కుగూడ పశువైద్యధికారి గిరీశ్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ 20 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశామన్నారు. యాదవులు గొర్రెల పెంపకం ద్వారా ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శివకుమార్, వైద్య సిబ్బంది రమేశ్, స్వాతి, లబ్ధీదారులు, తదితరులు పాల్గొన్నారు.

రహ‘దారేది’?

- 10 అడుగులు కూడా లేని రోడ్డు
- ప్రయాణం నరకయాతన
- నిత్యం ట్రాఫిక్ జాం
- రోడ్డు విస్తరణకు కృషి చేసేదెవరు?



ఇరుకురోడ్డులో అవస్థలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఎస్సీ బస్తీకి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెద్ద వాహనాలు ఎదురుపడితే గంటకుపైగా ట్రాఫిక్ జాం అవుతోంది. దీనికి ప్రధాన కారణం 10 అడుగుల వెడల్పే రోడ్డు ఉండడం. నాదర్‌గుల్‌లోని ఎస్సీ బస్తీకి, పలు కాలనీలతో పాటు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు వెళ్లాలంటే ఈ 10 పీట్ల రహదారే తప్పా మరో మార్గం లేదు. అలాగే కొత్తగా ఏర్పడిన కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని తీసుకువచ్చే లారీలు, క్రూజర్లుతో పాటు ఎస్సీ బస్తీ వరకు నడుపుతున్న ఆర్టీసీ బస్సులు, కార్లు, బైక్‌లతో ఈ దారి నిత్యం రద్దీగా ఉంటోంది. వాహనాలు ఎదురుపడితే గంటల కొద్దీ ట్రాఫిక్ జాం అవుతోంది. దీంతో స్థానికులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్ల విస్తరణ ఎందుకు చేయడం లేదు?

అన్ని అంతర్గత రోడ్లను వెడల్పు చేస్తున్నామని అధికార పార్టీ నాయకులు, అధికారులు చెబుతున్నా.. వీరి వాగ్దానాలు కేవలం ప్రకటనకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ఈ రోడ్డును ఎందుకు వెడల్పు చేయడం లేదని ఎస్సీ బస్తీవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని రోడ్డు వెడల్పు చేయాలని నాదర్‌గుల్ వాసులు కోరుతున్నారు.

రోజూ ఇబ్బందులే



రెండు బస్సులు, కార్లు ఎదురుపడ్డాయంటే భారీగా ట్రాఫిక్ జాం అవుతోంది. ఇరుకు రోడ్డు వల్ల వాహనాల సైడ్ మిర్రర్లు, అద్దాలు ధ్వంసం అవుతున్నాయి. ట్రాఫిక్ వల్ల ఎమర్జెన్సీ వాహనాలు అక్కడే ఆగిపోతున్నాడు. ప్రభుత్వం స్పందించి రోడ్డును వెడల్పు చేయాలి.

ప్రభాకర్, నాదర్‌గుల్

కులవృత్తుల అభివృద్ధికి కృషి



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యాదవులు

మంత్రి సబితాఇంద్రారెడ్డి

తుక్కుగూడ: కులవృత్తుల, సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రావిర్యాల గ్రామానికి చెందిన యాదవులు నగరంలోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులాల ఆత్మగౌరవం కోసం సీఎం కేసీఆర్ ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నారన్నారు. అదే స్ఫూర్తితో మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతీ కులానికి ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రావిర్యాలలో యాదవ భవనం కూడా నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు క్ష్మయ్య యాదవ్ పాల్గొన్నారు.

గౌడ కుల సమస్యలు పరిష్కరించాలి



పల్లె రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అల్మాస్‌గూడ గౌడ కులస్తులు

బడంగ్‌పేట్: గౌడ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం గీత కార్మికుల చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌కు అల్మాస్‌గూడ గౌడ కులస్తులు వినతిత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్మాస్‌గూడలోని పలు కాలనీల్లో ఉంటున్న గౌడ కులస్తులు సొసైటీ ఏర్పాటునకు, గౌడ సంఘం కులస్తులకు లైసెన్సుల మంజూరునకు వినతి పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సంక్షేమంతో పాటు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం తరుపున ప్రత్యేకంగా ఆర్థిక వెసులుబాటు కలిగించేలా చర్యలు తీసుకోవాలని పల్లె రవికుమార్‌గౌడ్ దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన ఆయన గౌడ కులస్తులకు సొసైటీ ఏర్పాటునకు సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. లైసెన్సులు కూడా మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం అల్మాస్‌గూడ అధ్యక్షుడు కటికపల్లి యాదగిరిగౌడ్, కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జెల్ల రమేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సలహాదారులు శ్రీనయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శి ఏ.నర్సింహాగౌడ్, రాంచందర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, నరసింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ‘ఉప్పల’ చేయూత



చిన్నారులతో జెడ్పీటీసీ, ఉప సర్పంచ్

జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: తండ్రి లేని చిన్నారుల చదువులకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ చేయూత నందిస్తున్నాడు. మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన నూర్జాన్‌బేగం, సద్దాంల పిల్లలైన అబ్దుల్ రహ్మాన్, ముస్కాన్‌లు 3వ, 4వ తరగతులు చదువుతున్నారు. వారి తండ్రి మృతిచెందడంతో కుటుంబం రోడ్డున పడింది. ఆర్థిక సమస్యలు పెరిగాయి. మండల కో ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్ సహకారంతో నూర్జాన్‌బేగం జెడ్పీటీసీని కలుసుకొని తన ఆర్థిక పరిస్థితిని వివరించింది. తన పిల్లలను చదివించాలని ఆమె కోరింది. స్పందించిన జెడ్పీటీసీ తమ ట్రస్టు ద్వారా పిల్లలిద్దరినీ చదివిస్తానని భరోసా ఇచ్చారు. సంబంధిత స్కూల్ యజమాన్యంతో మాట్లాడి పిల్లలను బుధవారం స్కూల్లో చేర్పించారు. భవిష్యత్‌లో ఉన్నత విద్యకు సహాయ సహకారాలు అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలపై దృష్టి

మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత



కడ్తాల్: మక్తమాదారంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత

కడ్తాల్: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత సూచించారు. బుధవారం మక్తమాదారం, వంపుగూడ గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వరిపంటలను శ్రీలత పరిశీలించారు. ఆయా గ్రామాల్లో వరి పంటలో కాండం తొలుచు పురుగును గమనించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయశాఖ అధికారి శ్రీలత పలు సూచనలు చేశారు. వరిలో కాండం తొలుచుపురుగును నివారించడానికి వరి ప్రధాన పొలంలో నాటుకునే ముందు 1 గుంట నారుమడికి 3 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను, నారు పికే వారం రోజుల ముందు చల్లుకోవాలని పేర్కొన్నారు. తొలుచు పురుగు, అగ్గి తెగులు నివారించడానికి పొలం గట్లకు కలుపు మొక్కలు లేకుండా శుభ్రం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమణ, రైతులు బాల్‌రాజ్, నర్సింహ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు



ఉత్తమ అవార్డు గ్రహీతలను సన్మానించిన ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో బాధ్యతగా పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు వస్తుందని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. ఉత్తమ ఎంపీడీఓ విజయలక్ష్మీ, టైపిస్టుగా శ్రావ్య, ఈజీఎస్ పథకానికి చెందిన ఇద్దరు సాంకేతిక సహాయకులకు ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు వచ్చినందుకు బుధవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సన్మానించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 11కేవీ హుడాసాయినగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో గురువారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజన్ ఇంజనీర్ కె. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి భవనం నేడు ప్రారంభోత్సవం

మహేశ్వరం: మండల కేంద్రంలో రూ.4కోట్లతో నిర్మాణం చేసిన 30పడకల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని గురువారం ప్రారంభిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ రాజగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆరోగ్యశాఖ మంత్రి టి. హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి. సబితాఇంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- రెండున్నర తులాల బంగారు గొలుసు
- రూ.7వేలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

మీర్‌పేట: ఇళ్లలో చోరీకి పాల్పడిన వ్యక్తిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 14వ తేదీన బడంగ్‌పేట బాలాజీనగర్‌కు చెందిన ఓ మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు, రూ. లక్ష, రెండు సెల్‌ఫోన్లను అపహరించాడు.

మరో ఇంట్లో..

అదే అపార్ట్‌మెంట్‌లోని మరో ఇంట్లో మూడు సెల్‌ఫోన్లను తీసుకొని వెళ్తుండగా అలికిడితో ఇంట్లోని వారు లేచేసరికి ఆ వ్యక్తి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేశారు. బడంగ్‌పేటలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న బండారి శివను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసు, రూ.7వేలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

అక్రమ నిర్మాణాలు నిలిపేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: రాయపోల్ రోడ్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ చంద్రకళకు సీపీఎం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మున్సిపాలిటీ కార్యదర్శి ఎల్లేశ్, సభ్యులు వీరేశంలు మాట్లాడుతూ రాయపోల్ రోడ్డులోని వైట్ గోల్డ్ కంపెనీ ప్రధాన రోడ్డు దగ్గర ఫెన్సింగ్ వేస్తున్నట్లు తెలిపారు. రోడ్డును వెడల్పు చేస్తున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలోని రాయపోల్ రోడ్డు గల పలు ఇళ్లను ఇటీవల కూల్చివేశారన్నారు. ఈ ప్రాంతంలో దారిగుండా రోడ్డు ఆక్రమణకు గురౌతుంటే ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు.

వాజ్‌పేయ్ అందరికీ స్ఫూర్తి

తలకొండపల్లి: ఇద్దరు ఎంపీలున్న బీజేపీని అధికారంలోకి తెచ్చిన ఘనత దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిదని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. బుధవారం వాజ్‌పేయి వర్ధతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నీతికి, నిజాయితీకి మారుపేరు వాజ్‌పేయి అని కొనియాడారు.

శ్రీరాం కాలనీ అభివృద్ధికి కృషి

కౌన్సిలర్ శంకర్



సీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ శంకర్

పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని 19వ వార్డు కౌన్సిలర్ పల్లపు శంకర్ తెలిపారు. వార్డు పరిధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి కృషితో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మధుబన్‌కు వెళ్లే దారిలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రటించిన రూ. 25 కోట్లలో.. వార్డుకు రూ. 80 లక్షలు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మారుతీ, శ్రీకాంత్, బాబు, శంకర్, నర్సింహా, రాజు, చందూ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని రక్షించడం అందరి బాధ్యత

బ్రిగేడియర్ వి.రెడ్డి



విద్యార్థులకు బ్యాడ్జీ పెడుతున్న స్కూల్ ప్రిన్సిపాల్

బడంగ్‌పేట్: దేశభక్తిని అలవర్చుకుని సమాజాన్ని రక్షించడం అందరి బాధ్యత అని బ్రిగేడియర్ వి.రెడ్డి అన్నారు. బుధవారం తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో విద్యార్థుల మధ్య ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. విద్యార్థులను యువ నాయకులుగా తయారు చేసేందుకు పాఠశాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ కార్తీక్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో కామెంట్లపై ఫిర్యాదు



రెడ్డి జేఏసీ, సంఘం ప్రతినిధులతో ఫిర్యాదు చేస్తున్న వంటేరు నర్సింహారెడ్డి

కులంపేరుతో దూషించాడని ఆరోపణ

మీర్‌పేట: సోషల్ మీడియాలో కులాన్ని కించపరిచే విధంగా కామెంట్లు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వంటేరు నర్సింహారెడ్డి బుధవారం రెడ్డి జేఏసీ, జిల్లెలగూడ రెడ్డిసంఘం ప్రతినిధులతో మీర్‌పేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి హోదాలో జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. అక్కడ తీసిన ఫొటోలను వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. ఈ విషయంలో స్థానికంగా నివాసముండే ఓంకార్ తనను వ్యక్తిగతంగా దూషిస్తూ కుల ప్రస్తావన చేస్తూ కించపరిచాడని ఆరోపించారు. గతంలోనూ పలు మార్లు ఇలాగే వ్యవహరించాడని అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని వంటేరు నర్సింహారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాజ్‌పేయ్‌కి నివాళి



వాజ్‌పేయ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నర్సింహ్మా, బీజేపీ నాయకులు

మీర్‌పేట: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి సందర్భంగా మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ్మా బుధవారం జిల్లెలగూడ లలితానగర్ చౌరస్తాలో వాజ్‌పేయ్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు మధు, సోమేశ్వర్, ప్రభాకర్, నాగరాజు, యాదగిరి యాదవ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



తలకొండపల్లి: విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న లక్ష్మీనివాస్

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే దేశాభివృద్ధి సాధ్యమౌతుందని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని లింగరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇచ్చినా అనుకున్నా లక్ష్యాలు మాత్రం నెరవేరలేదన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, సైంటిస్ట్ మురళీకృష్ణ, సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, ఉప సర్పంచ్ మణికంఠ, ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని యద మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంగిశెట్టి బాబు అన్నారు. బుధవారం లింగంపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వాటర్ బాటిల్స్, ఎడ్యుకేషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



మంచాల: లింగంపల్లి పాఠశాలలో విద్యార్థులకు బాటిళ్లు పంపిణీచేసిన సంగిశెట్టి బాబు

సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ మున్సిపాలిటీ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశ్



లేబర్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మున్సిపాలిటీ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని లేబర్ కార్యాలయ అధికారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలను సవరించాలన్నారు. కార్మికుల పని స్వభావంతో చేతి వ్రేళ్లు అరుగుదలకు గురై వేలి ముద్రలు సరిగా రావని పేర్కొన్నారు. ఈ నిబంధనను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కొత్త లేబర్ కార్డులు ఇవ్వాలని, కార్డు నమోదు, రెన్యూవల్ పాత పద్ధతిలోనే జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సంతోశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అంకమారావు సభ్యులు రాములు, తిరుపతయ్య, రాంబాబు, శివనాగరాజు, యాదయ్య, ప్రవీణ్, రమేశ్‌లు పాల్గొన్నారు.